
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# కేటుగాళ్లు వస్తున్నారు!

## ఫుడ్ సేఫ్టీ సిబ్బంది ముసుగులో నకిలీల దందా

**ఆహార తయారీ, విక్రయ కేంద్రాల యజమానులకు బెదిరింపులు**

**లైసెన్సుల మంజూరు, రెన్యువల్ క్లియరెన్స్‌కు బేరసారాలు**

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు3, ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలను ఆసరాగా చేసుకుని, కొందరు కేటుగాళ్లు తమను తాము జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులమని లేదా శాఖా ప్రతినిధులమని పరిచయం చేసుకుంటూ వ్యాపారులను మోసం చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సంస్థలు, ఆహార తయారీ మరియు విక్రయ కేంద్రాల యజమానులకు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ లేదా ప్రత్యక్షంగా కలిసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికేట్లు ఇప్పిస్తామని, లైసెన్సులను తక్షణమే మంజూరు చేస్తామని, రిజిస్ట్రేషన్ల రెన్యూవల్ త్వరగా పూర్తి చేస్తామని, తనిఖీల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామని మరియు నోటీసులు రాకుండా సహాయపడతామని నమ్మబలికి వ్యాపారుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి హామీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, ఎవరికీ నగదు చెల్లించవద్దని ఆయన స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పునరుద్ధరణ, శిక్షణా కార్యక్రమాలు మరియు >>2



# ఇక ఈపాస్ రద్దు!

**ఎరువుల విక్రయానికి ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్**

**క్యూఆర్ కోడ్‌తో పారదర్శకంగా పంపిణీ**

**అడ్వాన్స్ బుకింగ్‌కు ఆధార్ లేదా ఫార్మర్ ఐడీ తప్పనిసరి**

**పైలెట్ ప్రాజెక్టు కింద వికారాబాద్ జిల్లా ఎంపిక**

**6 నుంచి అమల్లోకి రానున్న కొత్త విధానం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఎరువుల విక్రయాలను పారదర్శకంగా చేపట్టా లన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నూతన డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) అనే యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు చేపట్టి సబ్సిడీ ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేసేందుకు రూపొందించారు. ఈనెల ఆకె నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అమలులోకి రానున్నది. పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణలో 10 జిల్లాలో ఎంపికైనాయి. అందులో వికారాబాద్ జిల్లా కూడా ఎంపికైంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఈపాస్, ఎఫ్‌బీపీ విధానాల ద్వారా ఎరువులు విక్రయిస్తున్నారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ఈపాస్, ఎఫ్‌బీపీ విధానాన్ని నిలిపివేస్తారు. అనంతరం ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌కు దానంతటకదే అప్‌గ్రేడ్ అవుతుంది.

వికారాబాద్ జిల్లాలో కూడా ఆరవ తేదీ నుంచి అమలు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు. ఈ యాప్ ద్వారా ప్రధానంగా బుకింగ్ విధానం, క్యూఆర్ కోడ్, ఎరువుల సేకరణ, పారదర్శకంగా సరఫరా వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులు తమ ఆధార్ కార్డు లేదా ఫార్మర్ ఐడీ ఉపయోగించి ఎరువుల కోసం అడ్వాన్స్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. యాప్‌లో బుకింగ్ పూర్తయిన తర్వాత ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ వస్తుంది. ఫర్టిలైజర్ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ చూపించి రైతులు సులభంగా ఎరువులు పొందవచ్చు. సాగు చేసే విస్తీర్ణం, పంట రకాల ఆధరాంగా ఎరవుల అవసరాన్ని అంచనా వేసి సరఫరా చేయడమే యాప్ ముఖ్య ఉద్దేశ్యం.

యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు పొందవచ్చు. ఎరువుల లభ్యత, నిల్వలు, విక్రయాలు, పంపిణీపై వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ విధానంపై అవగాహన కల్పించనున్నారు. ఎరువుల బుకింగ్‌కు సహకరించేందుకు జిల్లాలోని మీసేవా కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేక సూచనలు జారీ చేయనున్నారు. రైతులకు యాప్‌పై మార్గనిర్ధేశం చేయాలని మీసేవా కేంద్రాలకు సమాచారం అందించనున్నారు. ప్రతి ఎరువుల విక్రేత (ఫర్టిలైజర్ డీలర్) తమ దుకాణం వద్ద రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగంపై సహాయం అందించేందుకు వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. స్వచ్ఛంధ సేవకుల ద్వారా రైతులకు బుకింగ్ ప్రక్రియ, ధృవీకరణ, ఎరువుల కొనుగోలు తదితర వాటికి సహకారం అందిస్తారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రేతలు వ్యవసాయశాఖ అధికారులు, రైతులు నూతన విధానం అమలుకు పూర్తి సహకారం అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి బీ.కవిత కోరారు.

# ప్రజల మధ్య ఉండలేకపోతే రాజీనామా చెయ్

**ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి తీరుపై**

**డిసిసి చీఫ్ వజ్రేశ్‌యాదవ్ ఫైర్**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఇక ప్రజల్లో ఉంటావా..ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తావా అంటూ మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిపై మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ (ఫైర్) ధ్వజమెత్తారు. ప్రజల్లో ఉండవూ..ప్రజా సమస్యలు పట్టవు..స్వంత విద్యాసంస్థలే ముఖ్యమా..? ప్రతిపక్షంలో ఉన్నా అభివృద్ధికి నిధుల కోసం ప్రభుత్వాన్ని అడగవు.. మేడ్చల్ నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి జరుగుతున్న విషయం ఎమ్మెల్యేకు తెలియదు అని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ >>2

# సర్కారు భూమికి రక్షణేది?

**★ తాండూరు నడిబొడ్డున కబ్జాలపై బిజెపి నిరసన ★ మున్సిపల్ ఆఫీస్ ముందే ఆక్రమణల పర్వం కొనసాగుతోందని ఆగ్రహం ★ అధికారుల మౌనంపై అనుమానాలున్నాయని ఆరోపణ ★ ప్రజావాణిలో మున్సిపల్ కౌన్సిలర్ల ఫిర్యాదు**

**తాండూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న ఆక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విపక్షాల నేతలు మండిపడుతున్నారు. బాధ్యతగా కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం వహించడంతో కబ్జాదారులు రాబంధుల్లా వాలిపోయి సర్కారు భూములను ఆక్రమిస్తున్నారని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. ఎక్కడికక్కడ దర్జాగా సరిహద్దులు ఏర్పాటు చేసుకుంటూ భారీ ఎత్తున శాశ్వత నిర్మాణాలు సైతం చేపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు తాండూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాగరంగ్ మల్లేశం, కౌన్సిలర్ అంతారం కిరణ్ తదితరులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 135తో పాటు పట్టణంలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని, లేకపోతే గత నాయకులకు పట్టిన గతే ప్రస్తుత ప్రజాప్రతినిధులకు కూడా పడుతుందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ప్రతిపక్ష నాయకులు హెచ్చరించారు.



ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణం



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నేతలు

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాండూరులో కబ్జాలు విచ్చలవిడిగా సాగాయని ప్రజాపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఈ అక్రమాలకు చెక్ పెడతామని, ఇసుక మాఫియాను అంతం చేసి, సర్కారు భూములను కాపాడుతామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని గుర్తు చేస్తున్నారు. అయితే, తీరా గెలిచాక స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ అక్రమాలను ప్రోత్సహించడమే కాకుండా, కబ్జాల పర్వంపై నోరు మెదపకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు.

తాండూరు పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములే లక్ష్యంగా ఈ ఆక్రమణలు జరుగుతున్నాయి. సర్వే నంబర్ 111.. విజయ విద్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, కోర్టులో కేస్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ లెక్కచేయకుండా నిర్మాణాలు పూర్తి చేయడం దారుణమని పేర్కొన్నారు. అధికారులే ఇది ప్రభుత్వ స్థలమని తేల్చి చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 129, 130లోని హయత్ నగర్/హైదరాబాద్ రోడ్డు మార్గంలో, ఏకంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించేశారని గుర్తు చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. సర్వే నంబర్ 135లో రైల్వే స్టేషన్ మార్గంలోని అత్యంత విలువైన భూమిని ఆక్రమించి పెద్ద ఎత్తున నిర్మాణ పనులు చేపట్టారని వివరించారు.

**షాద్‌నగర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కె విల్లాస్ వెంచర్‌లో బీరప్ప స్వామి దేవాలయం నిర్మాణాలను కూల్చివేయడం పట్ల షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత వై. అంజయ్య యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి కూల్చివేసిన దేవాలయ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఆయన వెంట పాల్గొన్నారు.దేవాలయం కూల్చివేత జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేసి మోసపూరితంగా భూములను స్వాధీనం చేసుకుని లేఅవుట్లు వేయడం దారుణమని అన్నారు.

## బీరప్ప ఆలయం ధ్వంసం!

**కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్**

ఫరూక్‌నగర్ ప్రాంతంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన బీరప్ప గడ్డ, కురుమ కులస్థుల ఇష్టదైవమైన బీరప్ప స్వామి దేవాలయాన్ని కూల్చివేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పట్టపగలు దేవాలయాలను కూల్చివేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. తమ తాతలు, తండ్రుల కాలంలో నిర్మించిన దేవాలయాన్ని నేడు కూల్చివేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయానికి సంబంధించిన పిల్లర్లు, స్టీల్ సామగ్రిని కూడా దౌర్జన్యంగా తొలగించడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని అన్నారు. సీఎస్కె విల్లాస్ వెంచర్‌లో పలువురు రైతుల భూములను కూడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు తన దృష్టికి వస్తోందని అంజయ్య యాదవ్ ఆరోపించారు. పక్కనే ఉన్న రైతు తన భూమిని అమ్మకపోయినా, రిజిస్ట్రేషన్ చేయించకపోయినా ఆ భూమిని కూడా లేఅవుట్ చేసినట్టు ఉందని, ఇలాంటి అక్రమాలు ఎన్ని జరిగాయో అధికారులు విచారణ చేసి బయటపెట్టాలని డిమాండ్ చేశారు.


**అధికారుల నిర్లక్ష్యమే కారణం..**

వెంచర్లకు లేఅవుట్ అనుమతులు మంజూరు చేసే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ధనవంతులు చెప్పిన మాటలు నమ్మి ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. బీరప్ప దేవాలయం కూల్చివేత ఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయడమే కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో అసహనం, ఆగ్రహం పెరిగి ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు తలెత్తక ముందే ప్రభుత్వం, పోలీసులు స్పందించాలని కోరారు.



ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న అంజయ్య

# అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలుడు



గాయపడిన శ్రీనివాస్, ప్రవళిక, హరిప్రియ

**తండ్రితో పాటు ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు**

**ఖాళీ బండ తొలగించి నిండుది మారుస్తుండగా ప్రమాదం**

**మేడ్చల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యులకు భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ సిలిండర్ మారుస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో తండ్రితో పాటు ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరంగవరం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ (37) ఇంట్లో ఖాళీ అయిన గ్యాస్ సిలిండర్‌ను తొలగించి కొత్త సిలిండర్ అమర్చుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న వస్తువులు చెల్లాచెదురయ్యాయి. శ్రీనివాస్‌తో పాటు అతని పిల్లలు ప్రవళిక (14), హరిప్రియ (10), విక్రాంత్ (6)లు తీవ్రంగా గాయపడ్డారు. అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా వినిపించిన భారీ శబ్దంతో చుట్టుపక్కల వారు ఉలిక్కిపడి ఇంటి వద్దకు పరుగులు తీశారు. లోపల రక్తసిక్తంగా పడి ఉన్న తండ్రి, చిన్నారులను చూసి స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, మేడ్చల్ 108 సిబ్బంది ఈఎంటీ సీతారామ్, పైలట్ బాలకృష్ణ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఆర్‌సీపీ డాక్టర్ చక్రవర్తి ఆన్‌లైన్ ద్వారా అందించిన సూచనల మేరకు అక్కడికక్కడే బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి, వారి పరిస్థితిని స్థిరపరిచేందుకు ప్రయత్నించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే సమయస్ఫూర్తితో స్పందించిన 108 సిబ్బంది సేవలను స్థానికులు ప్రశంసించారు. మరికొన్ని నిమిషాలు ఆలస్యమై ఉంటే పరిస్థితి మరింత విషమించేదని గ్రామస్థులు పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళ జరిగిన ఈ హృదయ విదారక ఘటన శ్రీరంగవరం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ స్థానికులు అండగా నిలిచారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది.



సాగు మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# ఎల్‌నినోను ఎదుర్కొందాం

**కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టి నష్టాలను తగ్గించుకునేలా రూపొందించిన ప్రత్యేక సాగు మార్గదర్శక పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ వివిధ జిల్లాల స్థానిక వాతావరణ, నేల పరిస్థితులను పరిశీలించి రైతులు అనుసరించాల్సిన సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి వినియోగ సామర్థం, పంటల నిర్వహణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు తదితర అంశాలను సమగ్రంగా పొందుపరుస్తూ ప్రత్యేక సాగు మార్గదర్శక పుస్తకాన్ని రూపొందించింది. ఈ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను రైతులు ముందుగానే అంచనా వేసుకుని నీటి లభ్యతకు అనుగుణంగా >>2

# అధికారులూ.. రాజకీయం చేయకండి!

**ప్రతి ఒక్కరూ కాల్ లిఫ్ట్ చేయాల్సిందే**

**ధారూర్ సమీక్షా సమావేశంలో శాసన సభాపతి వార్నింగ్**

**ధారూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయక పోయినా సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను హెచ్చరించారు. సోమవారం ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తీవ్రంగా స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్, అధికారులు ఎవరైనా సరే ప్రజాప్రతినిధులు, ప్రజల ఫోన్ కాల్స్ తప్పనిసరిగా లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఫోన్లు ఎత్తకపోతే >>2



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

## సమస్యను శ్రద్ధగా వినడం మన బాధ్యత

**అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**

**రంగారెడ్డిఅర్బన్,ఆగస్టు 3, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు వెనుక ఒక కుటుంబం, ఒక సమస్య ఉంటుందని గుర్తించి అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం నుంచే ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని తమ వినతిపత్రాలను సమర్పించారు. కలెక్టర్ ఒక్కొక్కరి సమస్యను ఓపికగా విని సంబంధిత అధికారులకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. >>2



2లో

## ఒకే ఒక్కడు!

**అధికారులు లేక బోసిపోయిన ప్రజావాణి**

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాత్రమే హాజరు**

## భూభారతి ఆపరేటర్ల ధర్నా

**విధుల నుంచి తొలగించవద్దని డిమాండ్**



2లో



2లో

## టెట్ మెటీరియల్ ఆవిష్కరణ

## మాజీ ఎంపిటిసికి ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ

**తలకొండపల్లి ఆగస్టు3, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్యను సోమవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై హైదరాబాదుసమీపంలోనీ తుక్కుగూడలో గల కొండేటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి అనంతరం డాక్టర్లతో సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి శీను తదితరులు ఉన్నారు.

## నీల రవీందర్‌కు ఘన సన్మానం

**షాద్‌నగర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నీల రవీందర్‌కు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీల రవీందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన ఆర్యవైశ్య యువతను సంఘటితం చేస్తూ, వారి సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం మరింత చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు అనుమారి మురళీధర్, అవోపా రాష్ట్ర నాయకులు పెండ్యాల జగదీశ్వర్, నాయకులు గుడిపాటి విజయ్ కుమార్, జవాద యశ్వంత్ రాజ్, గడ్డ ఆంజనేయులు, వేముల ఆనంద్ బాబు, పెనుగొండ అశోక్ తదితరులు పాల్గొని నీల రవీందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆర్యవైశ్య యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని నీల రవీందర్ తెలిపారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ

**తలకొండపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రజలందరికీ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ తమ ఇంటి సమీపంలో మొక్కలు నాటుకోవాలని, పర్యావరణ కాపాడేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి ్మ, గ్రామ కార్యదర్శి వాజిద్, వార్డు సభ్యులు శేఖర్ వెంకటయ్య శ్రీశైలం గణేష్ నాయకులు నరేందర్ గౌడ్, జర్నలిస్ట్ నాయకులు విష్ణువర్ధన్, బాలచందర్ రాజేందర్ రెడ్డి యుగంధర్ గౌడ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**సిమెంట్ పంపిణీ**

మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో సోమవారం నాడు ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి ఉచితంగా సిమెంటును పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మంద శాంతమ్మ ఆర్థికంగా లేకపోవడంతో తమ ఇంటి నిర్మాణానికి అవసరమగు సీకులు సిమెంటును ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద వారికి, ఆర్థిక స్తోమత లేని పేదవారికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని, ఇంటి నిర్మాణానికి కావలసిన మెటీరియల్ అందజేయడం అభినందనీయమని వారు కొనియాడారు.

## హకీంపేట్ విద్యార్థులకు సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని వినతి..

**దుద్యాల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** హకీంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న ఈర్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది విద్యార్థులకు సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీయూపీఎస్ ఈర్లపల్లి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సరిత రవినాయక్ కాడ కొడంగల్ ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం 4:15 నుంచి 6 గంటల వరకు ఈర్లపల్లి వైపు బస్సు లేక విద్యార్థులు హకీంపేట్ బస్‌స్టాప్‌లో ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. కోస్గీ డిపో అధికారులతో సమన్వయం చేసి పాఠశాల ముగిసే సమయానికి ఈర్లపల్లి వైపు ఒక బస్సు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు.

## పరిగి పట్టణం, మరియు మండల ఇంచార్జిగా వారాల సిరాజుద్దీన్ నియామకం

**మోమిన్‌పేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాష్ట్ర అసెంబ్లీ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాలమేరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో గ్రామ, మరియు, మండలం, పట్టణాల ఇంచార్జులుగా జిల్లా అధ్యక్షులు థారాసింగ్ ఆధ్వర్యంలో ఇంచార్జి పదవులను కేటాయించినట్లు వికారాబాద్ జిల్లా పార్టీ ప్రధానకార్యధర్శి వారాల సిరాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతు మోమిన్‌పేట్ మండల కేంద్రానికి చెందిన నన్ను పార్టీ జిల్లా ప్రధార కార్యధర్శిగా నియమించి నన్ను ఇన్ని రోజులు పార్టీకి చేసిన సేవలను గుర్తించి నేడు పరిగి పట్టణ, మరియు మండల ఇంచార్జిగా బాధ్యతలను అప్పగించినందుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ కు, జిల్లా పార్టీ అధ్యక్షులు థారాసింగ్ లకు ప్రత్యేక ధన్యవాధములు తెలిపారు. అదే విధంగా తను పార్టీ అధిష్టానాలకు కట్టుబడి ఉండి ప్రతి ఒక్కరితో కలుపుగోలు తనంతో ఉండి పార్టీ బలోపేతానికి నిరంతర కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే పార్టీలో ఖష్టపడి పార్టీకొరకు పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. ఇట్టి పదవవీ బాధ్యతలు అప్పగించినందుకు నా బాధ్యతలను పార్టీ ప్రతిష్టత కొరకు కృషి చేస్తానని అన్నారు. అదిష్టానం అప్పగించించిన ఇట్టి బాధ్యతలను తూచా తప్పకుండా వారి సూచనలు, సలహాల మేరకు పరిగి పట్టణ, మండల ప్రజలను పార్టీ కార్యకర్తలను, ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ కొరకు ప్రతి ఒక్కరిని పనిచేసే సైన్నికులుగా తయారు చేస్తానని తెలిపారు. ఇంత పెద్ద బాధ్యత అప్పగించి నియమించిన శాసన సభాపతి ప్రసాద్ కుమార్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు థారాసింగ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అరుణ గోదాం సీజ్

**మేడ్చల్, ఆగస్టు 3. ప్రభాతవార్త :** ఎల్లంపేట్ మున్సిపాలిటీ కేంద్రమైన ఎల్లంపేట్ గ్రామ శివారులో అరుణ గోదాంను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ సోమవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాన్ని సీజ్ చేశామని టీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట, రాజబొల్లారం వార్డు ఆఫీసర్స్ పి రవీందర్‌రెడ్డి, డి. రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతి ఆపరేటర్ల ఆందోళన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఎన్నో ఏళ్ల తరబడిగా సేవలందిస్తున్న భూభారతి ఆపరేటర్లను ప్రభుత్వం ఒక్కసారిగ విధుల నుంచి తొలగించాలని నిర్ణయం తీసుకోవటం అన్యాయమని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మేడ్చల్ జిల్లా భూభారతి ఆపరేటర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి వచ్చిన భూభారతి ఆపరేటర్లు విచ్చేసి ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేసి ఆ తరువాత జిల్లా కలెక్టరేట్ వద్ద వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా భూభారతి ఆపరేటర్లు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో భూభారతి పోర్టల్ నిర్వాహణలో కీలకపాత్ర పోషిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న తమను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని మండలాల తహసీల్దార్ల వద్ద, ఆర్డీఓల వద్ద కార్యాలయాల్లో భూభారతి ఆపరేటర్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. భూభారతి రికార్డుల నమోదు, ధరఖాస్తుల పరిశీలన, సాంకేతిక సేవలు, రైతులు, ప్రజలకు మార్గదర్శకంగా కీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు ఎన్నో సంవత్సరాల అనుభవంతో పనిచేస్తున్నామని, ఒక్కసారిగ తొలగించటం అన్యాయమన్నారు. ఇటీవల ధరణి పోర్టల్ అమలులో చోటుచేసుకున్న అవతవకలు, అక్రమాలకు ఆపరేటర్లను కూడ బాధ్యులుగా భావిస్తూ ప్రభుత్వం వారి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లను నియమించే ఆలోచనలో ఉందన్న వార్తలు తమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే భూభారతి ఆపరేటర్లను ఆదుకోవాలని, యధావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ప్రభుత్వం తమ సమస్యలకు సానుకూలంగ స్పందించి పరిశీలించి ఉద్యోగ భద్రత కల్పిస్తూ తమను యధావిధిగా కొనసాగించాలని తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# భూ భారతి ఆపరేటర్ల తొలగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూ భారతి ఆపరేటర్లు

**మేడ్చల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ధరణి ప్రారంభమైన నాటి నుంచి రెవెన్యూ శాఖలో భూ భారతి పోర్టల్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న తమను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మేడ్చల్ జిల్లా భూ భారతి ఆపరేటర్లు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆపరేటర్లు మాట్లాడుతూ ధరణి పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రంలోని తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయాల్లో భూ రికార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, సాంకేతిక సేవలు, రైతులు, ప్రజలకు మార్గదర్శకత్వం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తూ వస్తున్నామని అన్నారు. ఎన్నోసంవత్సరాలుగా అనుభవాన్ని సంపాదించి రెవెన్యూ వ్యవస్థలో అంతర్భాగంగా పనిచేస్తున్న తమను ఒక్కసారిగా తొలగించడం తీవ్ర అన్యాయమని వారు వాపోయారు. ఇటీవల ధరణి పోర్టల్ అమలులో చోటుచేసుకున్న అవకతవకలు, అక్రమాలకు ఆపరేటర్లను బాధ్యులుగా భావిస్తూ ప్రభుత్వం వారి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లను నియమించే ఆలోచనలో ఉందన్న వార్తలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. కొందరు చేసిన తప్పులకు అందరినీ బాధ్యులను చేయడం సరైన విధానం కాదని, నిజాయితీగా విధులు నిర్వహించిన ఉద్యోగుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ సేవలో భాగస్వాములమై పనిచేస్తున్న మమ్మల్ని ఎలాంటి ప్రత్యామ్నాయఉపాధి లేకుండా తొలగిస్తే మా కుటుంబాలు రోడ్డున పడుతాయని, మా సేవలను, అనుభవాన్ని గుర్తించి యథావిధిగా కొనసాగించే అవకాశం కల్పించాలని ఆపరేటర్లు కలెక్టర్‌ను కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి**




రాజబొల్లారం తండాలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి

**మేడ్చల్, ఆగస్టు 3. ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధి రాజా బొల్లారం తండాలో రూ. 10 లక్షల నిధులతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్ నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలో సమస్యలను గుర్తించి వార్డుల వారిగ ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడు తున్నామని ఈ సందర్భంగా చైర్ పర్సన్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజల సహకరించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజిత దేవేందర్‌రెడ్డి, కమిషనర్ కృష్ణా రెడి, ఏఈ దుర్గా ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు శాంతి రాజు నాయక్, సురేష్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, భాస్కర్, సురేందర్, ఓం ప్రకాష్, నిషిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేటుగాళ్లు వస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆహార భద్రతకు సంబంధించిన అన్ని సేవలు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, అధికారిక విధానాల ప్రకారమే జరుగుతాయని వివరించారు. వీటి కోసం ఎలాంటి మధ్యవర్తులను సంప్రదించాల్సిన అవసరం లేదని, అవసరమైన సమాచారం కోసం నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయం లేదా సంబంధిత అధికారులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు ఎవరూ వ్యక్తిగతంగా ఫోన్ చేసి గానీ, ఇతరుల ద్వారా గానీ నగదు వసూలు చేయరని, అధికారిక రుసుములు ఉంటే ప్రభుత్వ నిర్దేశిత విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఫుడ్ సేఫ్టీ అధికారులమని చెబుతూ డబ్బులు అడిగినా, తప్పుడు హామీలు ఇచ్చినా వెంటనే అప్రమత్తం కావాలని హెచ్చరించారు. జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వ్యాపారులు పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణలో వ్యాపారుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, మోసపూరిత ఫోన్ కాల్స్ లేదా డబ్బులు డిమాండ్ చేసే సంఘటనలు ఎదురైతే వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం అందించాలని కోరారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి మోసాలను అరికట్టడంతో పాటు ఇతరులను కూడా మోసగాళ్ల బారిన పడకుండా కాపాడవచ్చునని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు

## ప్రజల మధ్య ఉండలేకపోతే రాజీనామా చెయ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ రెండున్నర ఏళ్లల్లో ఎమ్మెల్యే గెలిచాక ప్రజలకు దూరంగా ఉంటున్నారని, ప్రజా సమస్యలు పట్టించుకోవటం లేదని, పండుగలు వస్తేనే ఆలయాలకు వచ్చి వెళుతున్నారని, నియోజకవర్గ ప్రజల సమస్యలు, అభివృద్ధి పట్టవా అంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరును ప్రశ్నించారు. స్వంత విద్యాసంస్థలను చూసుకోవటానికేనా మేడ్చల్ ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారా అంటూ డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ ఎద్దేవా చేశారు. గతంలో ఓసారి ఎంపిగా, ఓ సారి ఎమ్మెల్యేగా గెలిచి బిఆర్ఎస్ హయాంలో మంత్రిగా పనిచేశారని, మళ్లీ మరోసారి మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డిని ప్రజలు గెలిపించారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షంలో మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి ఉన్నా గత రెండున్నర ఏళ్లుగా ప్రజాసమస్యల పరిష్కారంపై నియోజకవర్గ అభివృద్ధిపై ఏనాడు కూడ అధికారులతో సమీక్షలు జరపలేదని, పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం అమలుకు కృషి చేస్తుందని, మేడ్చల్ నియోజకవర్గంలో 315కోట్ల రూపాయలతో ఇంటి గ్రేటెడ్ స్కూల్స్, పబ్లిక్ స్కూల్స్ నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేసినా గత ఎనిమిది నెలల నుంచి ఎక్కడ స్కూల్స్ మంజూరు అయ్యాయి, నిర్మాణ పనుల గురించి ఏనాడు కూడ పట్టించుకోలేదని ఏ రోజైనా అధికారులను అడిగి తెలుసుకున్న దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. ఎక్కడ తన విద్యా సంస్థలకు నష్టం కలుగుతుందనే ఆలోచనతో ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రభుత్వ నూతన విద్యావిధానం గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం కెజి టు పిజి వరకు విద్యను అందించాలన్న లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ భవనాలను నిర్మించాలని, శంకుస్థాపనలు చేశారని భవనాల కోసం పలు చోట్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 600కోట్ల రూపాయలతో పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు వీటిపై కూడ ఎమ్మెల్యేకు పట్టింపు లేదని వజ్రేశ్‌యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా కనీసం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన దాఖలాలు కూడ ఎక్కడ లేవని ఆయన విమర్శించారు. విద్యా, రోడ్లు, భవనాల నిర్మాణాలు ఏవి కూడ పట్టించుకోవటం లేదన్నారు. పండుగలు వస్తే మాత్రం గ్రామాల్లోని ఆలయాలకు వచ్చి వెళ్లటం తప్ప..పేదల గురించి, సమస్యల పరిష్కారం, అభివృద్ధి గురించి మాట్లాడింది లేదని ఆయన విమర్శించారు. గుండ్లపోచంపల్లిలో ఎస్సీకార్పోరేషన్‌కు సంబంధించి 32గుంటల భూమి కూడ దర్జాగ కబ్జాలు చేశారని ఆయన ఆరోపించారు. వ్యాపారాలపై ఉన్న దృష్టి పెట్టటం తప్పా ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజల సమస్యలు పరిష్కరిస్తా..ప్రజలకు అందుబాటులో ఉంటా అని ఏనాడు కూడ ఆలోచన చేయటం లేదని వజ్రేశ్‌యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యేగా మల్లారెడ్డి వేతనం తీసుకుంటున్నారని బేషరతుగా ప్రజల కోసం పనిచేయాలని, ప్రభుత్వం నుంచి అభివృద్ధి కోసం నిధులు తీసుకరావటానికి పోరాడాలని అన్నారు. ప్రతిపక్షంలో ఉండి కనీసం ప్రభుత్వంపై నిధుల కోసం కూడ అడిగినట్లు, పోరాటం చేసినటు వంటి దాఖలాలు కూడ లేవని ఆయన ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజల్లో ఉండటం లేదని ఆలయాలు తప్ప అభివృద్ధి,సమస్యలు పట్టవా అని నిలదీశారు. తాను ఎమ్మెల్యేగా ఓడినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి అభివృద్ధి కోసం నిధుల కోసం కృషి చేస్తున్నట్లు, ప్రజలు ఎమ్మెల్యేగా మల్లారెడ్డిని గెలిపించింది తన విద్యాసంస్థలు చూసుకోవటానికేనా అంటూ ఆయన విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలని లేదా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని వజ్రేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఇక ఎమ్మెల్యేగా పనిచేయకుంటే వదిలేదే లేదని, అక్రమాలు వెలికి తీస్తామని తనకు ప్రజలు సగ భాగం అని, మల్లారెడ్డిని నిలదీయటం సగ భాగం అని వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియతో 2లక్షల వరకు ఓట్లు పోతున్నాయని అన్నారు. ఎమ్మెల్యేగా పదవిలో ఉండి పోరాడుతావా..ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తావా అంటూ వజ్రేశ్‌యాదవ్ తేల్చుకోవాలని స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో 16మున్సిపల్ డివిజన్లు, 3మున్సిపాల్టీలు ఉన్నట్లు ఎమ్మెల్యే ఆలయాలు, తన విద్యాసంస్థలే చూసుకుంటే మాత్రం, తాము ప్రజల్లో ఉండి ఎమ్మెల్యేను తిరగనివ్వమని, వదిలేది లేదని డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ స్పష్టం చేశారు.

## ఎలినినోను ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర నిపుణుల కమిటీ రూపొందించిన ఈ మార్గదర్శక పుస్తకం రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై స్పష్టమైన అవగాహన కల్పించి మెరుగైన దిగుబడులు సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ మార్గదర్శకాలను ప్రతి రైతుకు చేరవేసి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించడం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## సమస్యలను వినడం మన బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల నుంచి భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, ధరణి సంబంధిత అంశాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, గృహాల మంజూరు, ఉపాధి, రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, డ్రైనేజీ, ఆరోగ్యం, విద్య, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనేక వినతులు అందాయి. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని నేరుగా సంప్రదించే వేదికగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అందే ప్రతి అర్జీని కేవలం నమోదు చేయడం మాత్రమే కాకుండా, దానికి పరిష్కారం చూపడమే అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. శాఖల మధ్య సమన్వయం అవసరమైన అంశాల్లో అధికారులు పరస్పరం సహకరించి ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, వారి సమస్యలను శ్రద్ధగా వినడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధి అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారికి సరైన సమాచారం అందించడంతో పాటు వారి సమస్య పరిష్కార ప్రక్రియపై స్పష్టత కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా అధికారులు సేవలు అందించాలని ఆయన అన్నారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 102 వినతులు అందాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన 33 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించిన 69 ఫిర్యాదులు నమోదయ్యాయి.

ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి వినతికి సత్వర పరిష్కారం అందించే దిశగా చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

## అధికారులూ.. రాజకీయం చేయకండి!

(మొదటి పేజీ తరువాయి)

ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో కొందరు మహిళా సమైక్య సీసీలు రాజకీయాలు చేస్తున్నారనే విషయం ప్రస్తావనకు రాగా, అధికారులు ఎవరూ కూడా రాజకీయాలు చేయవద్దని గట్టిగా చెప్పారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష జరుగగా, మొత్తం 532 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 87 ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అయితే గ్రామాల్లో కొందరు లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు కట్టుకునే స్థితిలో లేరని సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన స్పీకర్.. ఇల్లు కట్టుకోలేని వారిని గుర్తించి ఆ జాబితాను తయారు చేయాలని, అర్హులైన వేరే వాళ్లకు ఆ అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

మళ్లీ జరిగే సమీక్షా సమావేశం లోపు పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని సభాపతి హామీ ఇచ్చారు. భూగర్భ జలాల వృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందని గుర్తుచేశారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, మండల స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వివిధ శాఖల మండల, డివిజన్ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ మెటీరియల్ ఆవిష్కరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త:** టెట్ పాస్ కాని ఉపాధ్యాయులకు ఎస్‌టియు టిఎస్ సంఘం వారు రూపొందించిన టెట్ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. సోమవారం మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో టెట్ మెటీరియల్‌ను డిఇఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ రేణుకాదేవి మాట్లాడుతూ ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర నాయకులు రూపొందించిన టెట్ మెటీరియల్ టెట్ పాస్ కాని ఉపాధ్యాయులకు దోహదపడుతుందన్నారు. టెట్ పాస్ కాని ఉపాధ్యాయులు ఈ టెట్ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయుల కోసం ఆలోచించి రూపొందించిన టెట్ మెటీరియల్ తక్కువ ధరలో అందించటం అభినందనీయమన్నారు. జిల్లాలో మిగిలిన ఉపాధ్యాయులు కూడ టెట్ పాస్ కావాలని అన్నారు. భవిషత్‌లో కూడ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఎడి లింగానందం, సూపరిండెంట్ సంధ్య, ఎస్ఓ అయ్యన్న, డిఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌టియు టిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరెళ్ల విఠల్, రాష్ట్ర అడక్‌కమిటీ సభ్యులు చందర్, జిల్లా సహాధ్యక్షులు అశోక్‌కుమార్, కీసర మండల ప్రధాన కార్యదర్శి సతీష్, దుండిగల్ అధ్యక్షులు వెంకటేశ్వరావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు రోడ్డు పనులను ప్రారంభం

**మోమిన్‌పేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** సర్పంచ్ ఎన్నికల్లో టేకులపల్లి గ్రామపంచాయతి అనుభంద గ్రామమైన సుద్ధోడ్కతాండ ప్రజలకు తాను ఇచ్చిన హామీ మేరకు ఫార్మేషన్ రోడ్డు పనులను తన స్వంత నిధులతో టేకులపల్లి గ్రామం నుండి సుద్ధోడ్కతాండ వరకు వెళ్ళే దారి సుమారు అరకిలోమీటరు మేర ఫార్మేషన్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా మన్మోహన్‌గౌడ్ మాట్లాడుతు గత 25, సంవత్సరాలుగా సుద్ధోడ్క తాండా ప్రజలు, రైతులు, విధ్యార్థులు, ప్రయాణికులు అనేక వ్యయప్రయాసాలకు గురౌతూ టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యం వస్తుండేవారు. కొన్ని సంధర్భాల్లో అనారోగ్యానికి గురైన వ్యక్తులు రవాణా సౌకర్యం లేక మృతి చెందిన సంధర్భాలు కూడా ఉన్నాయని, ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి రాగా హృధయం చలించి ఎట్టి పరిస్థిలో కూడా తాండా ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఇచ్చిన మాట నేడు నిలబెట్టుకున్నామన్నారు. రోడ్డు వేసేందుకు దళిత పట్టాదారులకు ప్రత్యాన్మాయంగా అట్టి రైతులు రాజు, చంద్రయ్య, నాగేష్, డప్పు మల్లేష్ లకు, అలాగే మిగితావారికి భూమి ఇప్పిస్తామని, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తో మాట్లాడగా నష్టపోయిన రైతులకు భూమి ఇచ్చేందుకు మోమిన్‌పేట్ తహశిల్దార్ మునీరొద్దీన్‌తో మాట్లాడి నష్టపోయిన రైతులకు భూమి ఇచ్చేందుకు సర్వే చేసి చూపిస్తామని తెలిపారు. దీంతో దళిత రైతులు తమ జీవనాధారమైన భూమిని ఇవ్వడానికి ముందుకు వచ్చారని అన్నారు. దీంతో మన్మోహన్‌గౌడ్ మందుకొచ్చి తాండావాసుల చిరకాల కోరిక నెరవేర్చారు. దీని ద్వారా తాండావాసులు టేకులపల్లి గ్రామానికి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం సుగమం అయ్యిందని తాండావాసులు, విధ్యార్థులు, నిత్యావసర సరుకులకొరకు, చౌకదర దుకాణానికి, పాఠశాలకు, ప్రతిదానికి టేకులపల్లి గ్రామానికి నిత్యం వెళ్లాల్సిందేనని అన్నారు. అలాగే అర్హులైన ప్రతి లబ్దీదారునికి రెండవ విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తానని, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రేస్ ప్రభ్వుంలో అందజేయడం ఖాయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు భాస్కర్, కాంగ్రేస్ పార్టీ ప్రధాన కార్యధర్శి మన్నె వెంకటేశం యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నరెందర్‌గౌడ్, పాండు, ఫయాజ్, సద్దాం, ఫిరోజ్, సీనియర్ నాయకులు కొండాపురం మహబూబ్ అలి, ఎఖ్బాల్ జలీల్, శ్రీనివాస్, అశోక్, ప్రమోద్, బాబూనాయక్, దీప్లానాయక్, ప్రశాంత్, బబ్లు, రామావత్ గ్రామపెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ముర్రుపాలు అందించాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు3,(ప్రభాతవార్త):** తల్లులు తప్పనిసరిగా తమ పిల్లలకు ముర్రుపాలు అందించాలని చౌదరిగూడ సర్పంచ్ శ్వేత చంద్రబాబు గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ శ్వేత మాట్లాడుతూ. శిశువు జననం తరువాత మొదటగా తల్లిపాలు అందించడంతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతుందని అన్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుదలకు ముర్రుపాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గర్భిణీ సమయంలో తల్లి తీసుకున్న పోషకాహారాలు, ఆరోగ్య నియమాలకు అనుగుణంగా బిడ్డ ఎదుగుదల ఉంటుందని అన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డకు తల్లిపాలు అందించే విధంగా అంగన్వాడీ సిబ్బంది సూచనలు సలహాలు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రబాబు గౌడ్, అంగన్వాడి సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్‌లో నీరు దర్శనం

**ఆందోళనకు దిగిన వాహనదారులు**

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు3,(ప్రభాతవార్త):**



జిల్లెడు చౌదర్‌గూడ మండల కేంద్రంలో గల నయార పెట్రోల్ బంకులో పెట్రోల్‌లో నీరు దర్శన మిచ్చింది. వాహనదారులు బాటిల్లో పెట్రోల్ పోయించు కుంటే దాంట్లో లీటరులో సగం వరకు నీరు వచ్చింది. దీంతో వాహనదారులు కగ్గుతిన్నారు. ఈ సంఘటనపై పలువురు వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల్లో కల్తీ ఇంధనం పోస్తే ఇంజిన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, మరమ్మతుల కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత పౌర సరఫరాల శాఖ, తూనికలు–కొలతల శాఖ, ఆయిల్ కంపెనీ అధికారులు తక్షణమే స్పందించి పెట్రోల్ నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అర్చక పురోహిత సంఘం అధ్యక్షునిగా రవిశర్మ ఎన్నిక

**షాద్‌నగర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని రామ్ మందిర్ లో జరిగిన అర్చక పురోహిత సంఘం అధ్యక్ష సంఘం ఎన్నికలలో సంబరాజు రవిశర్మ ఏకగ్రీవంగా అర్చకులు ఎన్నుకున్నారు ఈ కార్యక్రమం బ్రాహ్మణ పెద్దలు రిటైర్డ్ ఎమ్మార్వో వెల్దండ రామారావు తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గౌరవరాజుల వెంకటేశ్వరరావు మరియు షాద్నగర్ టౌన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వావిలాల సుజీవన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి అర్చకులు పెద్ద ఎత్తున పాల్గొని గౌరవాధ్యక్షునిగా రాజశేఖర్ శర్మ మరియు అధ్యక్షునిగా రవి శర్మ ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ ను అర్చకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అతి త్వరలో కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## మేడ్చల్ ప్రజావాణిలో ఒకే ఒక్కడు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాధారణంగా ప్రతి సోమవారం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ, సంబంధిత శాఖల నుంచి వాటికి ఎంతవరకు పరిష్కారం లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సాధారణంగా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, డీఆర్ఓలు పాల్గొనే ఈ కార్యక్రమంలో, ప్రస్తుత జిల్లా కలెక్టర్ మనుచౌదరి పది రోజుల సెలవులో ఉండటం, జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌గా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్ఓగా మాలతి కొనసాగుతున్నప్పటికీ సోమవారం మాత్రం వేదికపై కేవలం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఒక్కరే హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దీంతో ప్రజావాణి వేదిక బోసిపోయినట్లు కనిపించింది. ఈ ప్రజావాణిలో మొత్తం 128 దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా భూసమస్యలకు సంబంధించి ఈసెక్షన్‌కు 17, డిసెక్షన్‌కు 32 అర్జీలు వచ్చాయి. అలాగే పింఛన్లు మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌డీఏకు 30 దరఖాస్తులు అందగా, మిగిలిన శాఖలకు తక్కువ సంఖ్యలో అర్జీలు వచ్చాయి. ప్రధానంగా జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్‌నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా, జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ భూములు మరియు దుండిగల్‌జిన్నారం సరిహద్దు ప్రాంతంలోని శ్మశానవాటికలతో కూడిన ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందాయి. అలాగే శామీర్‌పేట పెద్ద చెరువు శిఖం పరిధిలో పేదలకు గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాల సమస్యపై మాజీ సర్పంచ్ బి. కిషోర్‌యాదవ్‌తో కలిసి బాధితులు అదనపు కలెక్టర్‌ను కలిశారు. దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న వారు భయపడాల్సిన అవసరం లేదని, అయితే కొత్తగా మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టం చేశారు. వీటితో పాటు ఒక దివ్యాంగుడు తనను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ప్రజలు ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తారని, ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు.



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

## దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి

### అధికారులకు జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్ ఆదేశం

**దుండిగల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** తండాప్రాంతంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డిప్యూటీ కమిషనర్‌తో కలిసి తండాలోని ప్రధాన రహదారులు, లింక్‌రోడ్లు, బస్తీరోడ్లను పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుంతలుపడి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన వెంటనే పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్ తండాలోని పలు ప్రధాన సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. శ్మశానవాటికలో రోడ్డు, తాగునీటి బోరు, వెయిటింగ్‌హాల్, స్నానగదులు వంటి మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా డ్రైనేజీ నీటి అవుట్‌లెట్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. శంకర్‌నాయక్ వినతులపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్ వెంటనే పరిపాలనా అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులు, హెచ్ఎంటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డులో అవకతవకలు..సిపిఐ ఫిర్యాదు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

**నిజాంపేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వాటర్‌బోర్డులో జరుగుతున్న అవకతవకలను వెంటనే సరిచేయాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ నాయకులు సోమవారం వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ ప్రమీలకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రజినీకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వికార్ సెక్షన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ, ఇంద్రన్న కాలనీ, ఎన్టీఆర్‌నగర్, సాయినగర్, రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని ఆరోపించారు. పాతమోటార్లు సరిగా పనిచేయక పోవడం, సబ్‌వాల్వ్‌లు దెబ్బతినడం వల్ల నీటి సరఫరా దెబ్బతింటోందని తెలిపారు. వాటిని తక్షణమే మరమ్మతులు చేయాలని కోరారు. అలాగే రాజీవ్ గృహకల్ప నుంచి విజయ్ టింబర్ విల్స్ వరకు 200 మిల్లీమీటర్ల పైప్‌లైన్‌కు అక్రమంగా కనెక్షన్ ఇవ్వడం వల్ల ఆ ప్రాంతానికి నాలుగు నుంచి ఐదు గంటల పాటు నీటి సరఫరా జరుగుతుండగా, మిగిలిన కాలనీలకు కేవలం అరగంట నుంచి గంటపాటు మాత్రమే నీరు అందుతోందని పేర్కొన్నారు. ఈ అక్రమ కనెక్షన్‌ను వెంటనే తొలగించి సమానంగా నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వే నంబర్-90లో నిర్మించిన భవనాలకు నిబంధనలకు విరుద్ధంగా ఒక అంగుళం వాటర్ కనెక్షన్లు ఇచ్చారని ఆరోపిస్తూ, వాటిని కూడా వెంటనే రద్దు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆశి యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, సమరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### సిఎంసి డిప్యూటీ కమిషనర్ లావణ్య





మాట్లాడుతున్న సిఎంసి డిప్యూటీ కమిషనర్ లావణ్య

**కొంపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కొంపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం కొంపల్లి సర్కిల్-56 కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సమస్యలను ఓర్పుగా విన్నారు. ఈ సందర్భంగా మొత్తం ఒక వినతిపత్రం అందగా, దానిని సంబంధిత శాఖ అధికారులకు వెంటనే పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలమేరకు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై వెంటనే చర్యలు ప్రారంభించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించేందుకు ప్రజావాణి కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా కొనసాగుతుందని తెలిపారు.

## ఒబిసి మోర్చా నూతన పదాధికారులను సన్మానం

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా ఫతేనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు యాదగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా బాలాజీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ నియమితులైన సందర్భంగా వారు సోమవారం బీజేపీనాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతనంగా నియమితులైన ఇద్దరిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా బీసీ వర్గాల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సి.హెచ్. శ్రీనివాస్‌గౌడ్, అత్తికరి మల్లేష్, సతీష్ గౌడ్, ఎమ్.ఎస్ రెడ్డి, సూరిబాబు, సంతోష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



# అభినవ వివేకానంద ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

### రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** నగరంలోని నల్గొండకూడలిలో ఆనాడు వివేకానందని విగ్రహాన్ని నెలకొల్పిననాడు అభినవ వివేకానందుడని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిని సంబోధించామని, ఈనాటికి ఆయనకది సార్థక నామమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఒక మంచి మాట, ఆలోచన, పని, ఉద్దేశం, ధ్యేయం కలిగిన వెంకటరెడ్డి వంటివారు సమాజానికి ఎంతో అవపరమన్నారు. అధిక విద్యావంతులు అప్రయోజకులైరి, పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి, ధనవంతులు రోగభూత పీడితలైరి, సత్యవంతులమాట జన విరోధంబాయే, కలవారంతా దరిద్రులైరి, లక్షధారైనా లవణమందంబేగానీ మెరుగు బంగారం మింగబోడు అన్నమాటలు వింటుంటే ఒళ్లు పులకరించిపోతుందని ఈనాటి సమాజవైఖరిని అన్నేళ్లక్రితమే సధింపు చేశారంటే కవులు దార్శనికులు, భవిష్యత్ దర్శనం చేస్తారనడానికి శేషప్ప కవిత్వంలో తెలుస్తుందని రమణాచారి తెలిపారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, చౌదూరి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభా మందిరంలో డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షత వహించిన వినూత్న ప్రక్రియలో ప్రతిష్టాత్మకంగా ప్రతీనెలా మొదటి ఆదివారం నిర్వహిస్తున్న తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల పరంపరలో 23వ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి. రమణాచారి ఆచార్య వంగపల్లి విశ్వనాథం, చౌదూరి నరసింహారావు, డా. ఒజ్జల శరత్‌బాబు, సాధన నరసింహాచార్య, చౌదూరి పద్మావతి, మద్ది అనంత రెడ్డి తదితరులతో కలిసి సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిని ఘనంగా సత్కరించి చౌదూరి సరోజినీదేవి గోపాలరావు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. అనంతరం డా. శరత్‌బాబు శేషప్పకవి ప్రణీత శ్రీ నరసింహ శతకముపై ప్రసంగించారు.




కసిరెడ్డి వెంకటరెడ్డిని సత్కరిస్తున్న రమణాచారి, ఫణీంద్ర, విశ్వనాథం తదితరులు



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

## సమస్యలను పరిష్కరించాలి : గోవర్ధన్‌రెడ్డి

**జూబ్లీహిల్స్, అగస్టు 3, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు జీఎచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌పార్టీ చేపట్టిన సమస్యలపై సమరం కార్యక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌ను కలిశారు. బంజారాహిల్స్ డివిజన్ ఉదయ్‌నగర్ సింగాడ బస్తీలో ప్రమాదకరంగా మారిన ప్రధాన నాలాను పునర్నిర్మించాలని, ప్రేమ్‌నగర్ సాయిబాబా కమాన్ వద్ద నాలాపై రక్షణ గ్రిల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వెంకటేశ్వర కాలనీ డివిజన్ రోడ్ నెం.3 నవోదయ కాలనీలో టైమ్స్ ఆఫ్ ఇండియా లైన్ పక్కనున్న దెబ్బతిన్న రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఫిల్మ్‌నగర్ డివిజన్ హనుమాన్ టెంపుల్ లేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని, ఖైరతాబాద్ డివిజన్ మూడు గుళ్ల ప్రాంతంలో వర్షపు నీరు, మంచినీటి పైపులైన్లు కలవడంతో కలుషిత నీరు వస్తోందని, దీనిపై అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్ల సమస్య తీవ్రంగా ఉందని ఎంజీఆర్ తెలిపారు. ముఖ్యంగా బాలాపూర్ బస్తీ, రామకృష్ణ నగర్ క్వార్టర్స్, ఇంద్రానగర్, దేవరకొండ బస్తీల్లో స్ట్రీట్ లైట్ల నిర్వహణను మెరుగుపరచాలని, అవసరమైన సామగ్రిని వెంటనే అందుబాటులో ఉంచి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. పాదయాత్రల సందర్భంగా ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 3,ప్రభాతవార్త:** కూకట్‌పల్లి చిత్తారమ్మ బోనాలు, మూసాపేట పోచమ్మ దేవాలయం వద్ద జరిగే బోనాలకు సంబంధించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. సోమవారం కూకట్‌పల్లి రామాలయంలోని అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్, శానిటేషన్, విద్యుత్ శాంతిభద్రతలు మొదలగు విషయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని అలాగే అమ్మవార్లకు జరిగే కైంకర్యాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని భక్తులకు ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. శానిటేషన్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పరిశుభ్రత పాటించే విధంగా చూడాలని జిహెచ్ఎంసి అధికారులకు తెలిపారు. ఎటువంటి ఇబ్బంది ఉన్న ఎడల తన దృష్టికి తీసుకురావాలని ప్రతిక్షణం పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్లు సూర్యారావు, హిమగిరిరావు, ఆనందరావు, నాయనేని తులసీరావు, నాగరాజు, ప్రభాకర్ ,విష్ణు చైతన్య, సంతోష్, మహేష్ అన్ని విభాగాల అధికారులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అమ్మవారి ఘటం ఊరేగిస్తున్న భక్తులు

## ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు

**కార్వాన్, ఆగస్టు 3 (ప్రభాతవార్త) :** సబ్జిమండిలో కొలువై ఉన్న శ్రీనల్ల పోచమ్మ మహంకాళి ఆలయ 104వ వార్షిక బోనాల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉమ్మడి బోనాల పూజ కమిటీ అధ్యక్షులు కట్ట లింగం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం సబ్జిమండిలోని మహంకాళి, నల్ల పోచమ్మ ఆలయ ఘటం ఊరేగింపు వైభవంగా ప్రారంభమైనది. అన్ని ప్రాంతాల వీధులగుండ సాగిన ఘటం ఊరేగింపునకు ప్రజలు ఘన స్వాగతం పలికి పూజలు నిర్వహించి,సాకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి బోనాల పూజ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లె రాంకుమార్,సలహాదారులు కట్ట రాజయ్య,సేనాపతి చంద్రశేఖర్, గూడబోయిన శివరత్నం, జలగరి వేణు, కట్ట శివరాజ్, బుర్ర వేణుకుమార్, కట్ట నర్సింగ్రావు, అవుశెట్టి శ్యామ్ సుందర్, గుడుమని అశోక్‌కుమార్, గాండ్ల నిరంజన్‌బాబు, ప్యాట నందకిషోర్, దొర్తుల శ్రీనివాస్ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ ఎసిపి

**కంటోన్మెంట్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. సోమ వారం పికెట్‌లోని కేంద్రీయ విద్యాలయం స్కూల్‌లో నిర్వహించిన అరైవ్, అలైవ్ అవగాహన సదస్సులో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, 4 చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్‌ను వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్ పాటించాలని, సెల్‌ఫోన్ డ్రైవ్ చేయరాదని, మైనర్లతో వాహనాలను నడిపించకూడదని వివరించారు.

## కూలిన క్వార్టర్స్ పైకప్పు

**బేగంబజార్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** పేక మేడల్లాంటి భవనాలు పెచ్చులూడుతున్నపై కప్పులు భారీ వర్షం కురిసినప్పుడు, గాలివీచినా నిత్యం భయం భయంగా జీవనం కొనసాగిస్తున్నారు.పురానాపూల్ డివిజన్‌లోని స్వామి వివేకనందనగర్ హరినబస్తీ బస్తీలలో క్వార్టర్స్‌ల దుస్థితి గోడలు,పగుళ్లు ఏర్పడి కూలిపోయే ప్రమాదం ఉంది. అయినప్పటికి అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్వార్టర్స్‌లో నివసిస్తున్న ప్రజలు పైకప్పు పెచ్చులూడిన ఎక్కడ తమ మీద పడుతుందోనని పగుళ్లు ఏర్పడిన గొడలు ఎప్పుడు కూలిపోతాయో భయాందోళన చెందుతున్నారు. 50 సంవత్సరాల క్రితం క్వార్టర్స్‌ను నిర్మించారు.ప్రభుత్వ స్థలంలో నిర్మించిన క్వార్టర్స్‌ను ఆరుబ్లాక్‌గా నిర్మించారు.ఇక్కడ సుమారు 500 వందకు పైగా క్వార్టర్స్‌ను నిర్మించారు.ఈ క్వార్టర్స్ పలు బ్లాక్‌లలో శిథిలమవుతున్నాయి.కాని అటు అధికారులుగాని ఇటు ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా కొత్త ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గొడలు బీటలు వారడంతోపాటు డ్రైనేజీ పైపులైన్లు లీకేజీ అవుతున్నాయి. ఈసమస్యలతో క్వార్టర్స్‌లో నివసిస్తున్న ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.గతంలో కూడా ఇంటినుంచి ఓ వ్యక్తి పడి తీవ్రగాయాలకు గురయ్యారైనట్లు స్థానికులు తెలిపారు.ఆదివారం అర్ధరాత్రిపై కప్పు కూలిపోయిందని స్థానికులు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

**చిక్కడపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు సోమవారం నాంపల్లిలోని ఎం.ఆర్. కాంప్లెక్స్‌లో ఉన్న 10వ జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 10 మందికి జరిమానాతో పాటు రెండు నుంచి నాలుగు రోజుల పాటు సామాజిక సేవ(కమ్యూనిటీ సర్వీస్) చేయాలని ఆదేశించింది. రెండో, మూడోసారి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన నలుగురికి మూడు, నాలుగు, తొమ్మిది రోజుల జైలుశిక్షతోపాటు జరిమానా విధించింది. మొత్తం కేసుల్లో కలిపి రూ.1,07,800 జరిమానా వసూలైంది. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. ఎడుకొండలు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# జాతరను వైభవంగా నిర్వహించుకున్నాం

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**బేగంపేట, ఆగస్టు 3, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరను అందరి సహకారంతో వైభవంగా నిర్వహించుకున్నామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మహాకాళీ అమ్మవారి ఆలయం వద్ద సేవలు అందించిన పలుశాఖల అధికారులు, వలంటీర్లను శాలువాతో సత్కరించి డెక్కన్ మానవ సేవా సమితి శతాబ్ది ఉత్సవాల మెమెంటోలను అందజేసారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, భక్తులకు సేవలు అందించిన వాలెంటీర్లు రెండు రోజుల పాటు ఆలయం వద్దే ఉండి తమ మాధ్యమాల ద్వారా కవరేజి చేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అభినందనలు తెలియజేసారు. సన్మానం పొందిన వారిలో జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ, వాటర్‌వర్క్స్, దేవాదాయశాఖ, ఆలయ పండితులు, ఎలక్ట్రికల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పాటు డెక్కన్ మానవ సేవా సమితి సభ్యులు, నల్లగుట్ట మిత్ర మండలి,మక్తాల ఫౌండేషన్, పలువురు స్వచ్ఛంద వలంటీర్లు ఉన్నారు.ఈ కార్యక్రమంలో డెక్కన్ మానవ సేవా సమితి వర్కింగ్ ప్రసిడెంట్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, నాయకులు కొండాపురం మహేష్‌కుమార్‌యాదవ్, కిషోర్, ఆనంద్‌పాటిల్, రాంమోహన్‌యాదవ్, అరుణ్‌భట్, జయరాజ్, సత్యనారాయణ, చంద్రప్రకాష్‌శర్మ, కమల్‌కుమార్, నర్సింగరావు, హరిబాబుయాదవ్, రఘు మోహన్ నాయుడు, శశాంక్, అనురాగ్ తదితరులు ఉన్నారు.



జాతరలో సేవలు అందించిన వైద్యాధికారి మౌనికను సత్కరిస్తున్న తలసాని

### భారతదేశాన్ని విశ్వగురువుగా మలచడంలో

## ప్రతి గురువు కృషి చేయాలి : చక్రపాణి

**రవీంద్రభారతి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** భారతదేశాన్ని విశ్వగురువుగా మలచడంలో ప్రతీ గురువు తమ బాధ్యతగా కృషిచేయాలని భారత్ వికాస పరిషత్, తెలంగాణ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు డి.నరేంద్రకృష్ణ సభా ధ్యక్షతన నిర్వహించిన గురువందనం-ఛాత్రాభినందనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్ర మహిళాసభ కళాశాల ఛైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి డి.చక్రపాణి అన్నారు. నేటి యువత కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఆచార్యులు, గురువులు ఆ దిశలో కృషిచేస్తే భారతదేశం తప్పక విశ్వగురువు స్థానానికి చేరుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి విశిష్ట అతిథులు ఉప్పలపాటి మల్లికార్జున్, వివేకానంద సేవాసమితి ఛైర్మన్ సిహెచ్.హనుమంతరావు, ఆత్మీయ అతిథులు సాధన నరసింహాచార్య, శివరామకృష్ణ, సదాశివరెడ్డి, నాగరాజు, గౌరీశంకర్ తదితరులతో కలిసి ఆచార్య వంగపల్లి విశ్వనాథం, డా. మర్రి కృష్ణారెడ్డి, టి.కె. సిస్టర్స్ (సంగీతం), శ్రీనివాసశర్మ (సాహిత్యం) తదితర 23మంది ప్రముఖ గురువులను ఘనంగా సత్కరించారు. నరేంద్ర కృష్ణ అధ్యక్షోపన్యాసంలో గురుశిష్యులకు అనుబంధం పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రధానవక్త మల్లికార్జున్ మారుతున్న పరిస్థితుల్లో భారతీయత, నైతిక విలువలు కొరవడుతున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు గురువులు మార్గదర్శనం చేయాలని కోరారు.

### అంబేద్కర్ వర్సిటీలో

## ఎంబీఏ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఆహ్వానం

**జూబ్లీహిల్స్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వ త్రిక విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఆసుపత్రి, ఆరోగ్య సంరక్షణ నిర్వహణ కోర్సుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 5 చివరి తేదీగా నిర్ణయించినట్లు విశ్వవిద్యాలయం విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు.విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఆసుపత్రి, ఆరోగ్య సంరక్షణ నిర్వహణ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే తెలంగాణ సమగ్ర ప్రవేశ పరీక్ష లేదా విశ్వవిద్యాలయం నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్య ర్థులు డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు అపోలో ఆసుపత్రులు, కిమ్స్, డెక్కన్ వైద్యకళాశాల, ఆర్వీఎం ఆసుపత్రి, రెనోవో ఆసుపత్రిలో నిర్వహించే ఆసుపత్రి, ఆరోగ్య సంరక్షణ నిర్వహణ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చ న్నారు. అలాగే సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని సాధారణ ఎంబీఏ కోర్సు లో చేరాలనుకునే వారు కూడా ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం 04023680333, 040 23680555 ఫోన్ నంబర్లను సంప్రదించాలని లేదా విశ్వవిద్యా లయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## మందుల కొనుగోళ్లపై అవకతవకలు

### .. విచారణకు ఆదేశం

**జూబ్లీహిల్స్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఆయుష్ విభాగంలో రూ.3.50 కోట్ల విలువైన ఔషధాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణ లపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. తెలంగాణ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఫిర్యాదు మేరకు ఆరోగ్య శాఖ మెమో జారీ చేసి, నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ చేపట్టాలని ఆయుష్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు తెలంగాణ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలిపింది. టెండర్ నోటిఫికేషన్, టెండర్ కమిటీ అనుమతి లేకుండానే రెండు సంస్థల నుంచి మందులు కొనుగోలు చేశారని, రూ.70 లక్షల విలువైన కర్పూర తైలం నాణ్యతపై కూడా అభ్యంతరాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సరఫరా చేయని మందులకు చెల్లింపులు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొందరు అధికారుల పాత్రపై ఆరోపణలు రావడంతో, మార్చి-ఏప్రిల్ 2024లో జరిగిన కొనుగోళ్లకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. సంబంధిత అధికారిపై గతంలోనూ ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తుంది.

## రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న మంజీరా ప్రాజెక్టులో భాగంగా ఉన్న కలబ్‌గూర్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ అవుట్‌డోర్ వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ (విసిబి) ఏర్పాటు, నిర్వహణ పనులు చేపట్టనుంది. ఈ పనులు ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగనున్నాయి. ఈ ఆరుగంటల పాటు జరిగే కొన్ని ప్రాంతాల్లో పాక్షి క, మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయ కలగనుంది.

**అంతరాయం ఏర్పడు ప్రాంతాలు...**

ఓఅండ్ఎమ్ డివిజన్ 19 పరిధిలోని ఆర్.సి.పురం, అశోక్‌నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేట్, మదీనాగూడ, మియాపూర్. ఓఅండ్ఎమ్ డివిజన్ 22 పరిధిలోని బీరంగూడ, అమీన్‌పూర్, భాగ్యనగర్ కాలనీ, ట్రాన్స్‌మిషన్ డివిజన్ 2లోని బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, బీహెచ్ ఈఎల్ టౌన్‌షిప్, హెచ్‌సీవై, ఇండస్ట్రియల్ ఏరియాలోని బల్క్ తాగునీటి కనెక్షన్లు, ట్రాన్స్‌మిషన్ డివిజన్ 4లోని ఆఫ్‌టేక్ పాయింట్లు మరియు బల్క్ తాగునీటి కనెక్షన్లు. జలమండలి వినియోగదారులు ముందస్తుగా అవసరమైన మేరకు తాగునీటిని నిల్వచేసుకుని, నీటిని పొదుపుగా వినియో గించాలని జలమండలి కోరింది. తాత్కా లిక అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

**జలమండలిలో 11 మంది ఉద్యోగుల పదవీ విరమణ...**

జలమండలిలో పనిచేస్తున్న పదకొండు మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. సోమవారం ఖైరతాబాద్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో పీఅండ్ఏ సీజీఎం సురేష్, జీఎం టీవీ సరస్వతి పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందరికి ధన్యవాదాలు : ఈవో

**బేగంపేట, ఆగస్టు 3,ప్రభాతవార్త :** శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆషాడ బోనాల జాతర విజయవంతం కావడంలో కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ధన్యవాదాలు తెలి పారు. బోనాల జాతరకు నిధులు కేటాయించడంతో పాటు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసేందుకు సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండా సురేఖ,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట నీలిమ,ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చినా అమ్మవారి దర్శనం కోసం సహనంతో వేచి చూసిన భక్తులు,ఫలహార బండ్ల నిర్వహకులు,సేవలు అందించిన వాలెంటీర్లకు ఈ ఓ కృతజ్ఞతలు తెలియజేసారు.

## పోరాట ఫలితమే చేప పిల్లల పంపిణీకి రూ.116 కోట్లు

### టిఎంకెఎంకెఎస్

**చిక్కడపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 2026..27 ఆర్థిక సంవత్సరానికి ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం రూ.116 కోట్లు కేటాయించడం మత్స్యకారులు సాధించిన పోరాట విజయమేనని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెం కల నర్సింహా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమం కోసం చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగిం చాలని, బడ్జెట్ కేటాయించాలని నిరంతరం పోరాటాలు చేశామని నాయకులు తెలిపారు: ఈ వరుస ఉద్యమాల ఒత్తిడితోనే ప్రభుత్వం దిగొచ్చి రూ.116 కోట్ల నిధులను కేటాయించిందని వారు పేర్కొన్నారు.

## అశ్రిత సంస్థకు జాతీయ పురస్కారం

**చార్మినార్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** బాలల రక్షణను బలోపేతం చేయ టంతోపాటు పిల్లలు కోసం చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా హైదరా బాద్ నగరంలోని అశ్రిత సంస్థకు ప్రతిష్టాత్మకమైన జాతీయ పురస్కారం లభించింది.ఢిల్లీలో మూడు రోజుల పాటు పిల్లల భద్రత,పిల్లల అధికారాలు, శ్రేయస్సు అన్న అంశంపై సదస్సు జరిగింది.

# నకిలీ ఎరువులతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**-ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి**
**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకటరెడ్డి**

**దౌల్తాబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:**
రైతులు నకిలీ ఎరువులు,మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకటరెడ్డి సూచించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..వ్యవసాయ సీజన్‌లో కొందరు మోసపూరిత వ్యాపారులు మార్కెట్లోకి నకిలీ ఎరువులను తీసుకొచ్చి అన్నదాతలను నిండా ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని,లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే కొనుగోళ్లు జరపాలని కోరారు.ఏది అసలు,ఏది నకిలీదో గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలని,నకిలీ ఎరువులను కొని మోసపోవద్దని ఆయన హితవు పలికారు.అలాగే దుకాణదారులు,ఏజెన్సీల నుండి ఎరువులు కొనుగోలు చేసిన ప్రతిసారీ తప్పనిసరిగా పక్కా రశీదు(బిల్లు) తీసుకోవాలని స్పష్టం చేశారు.ఒకవేళ ఎవరైనా నకిలీ ఎరువులు విక్రయిస్తూ మోసాలకు పాల్పడితే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ముందుకు రావాలని ఈ సందర్భంగా బోడి వెంకట్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు.

# బ్యూటీనెస్ట్‌లో పార్కుస్థలాన్ని కాపాడాలని జడ్‌సీకి వినతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని బ్యూటీనెస్ట్ కాలనీలోని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని బ్యూటీనెస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఎంఎంసి ఉప్పల్ జడ్సీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధికాగుప్తాకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ అల్లూరి వాణిరెడ్డిని కలిసి పార్కు స్థలం కడీలను విరగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

సర్వేనంబర్ 286లోని బ్యూటీనెస్ట్ కాలనీలో కేటాయించిన పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమణ చేసి నిర్మాణాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని దీనిపై ఫిర్యాదు చేయగా అధికారులు స్థలం చుట్టూ కడీలు నాటగా రాత్రి వాటిని ధ్వంసం చేశారని విచారణ జరిపి పార్కు స్థలాని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షులు పడమటి సీతారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మెందు వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారి బాడే సైదులు జడ్‌సీకి ఫిర్యాదు చేశారు.



## గరీబోళ్లను ఆదుకోవడంలోనే నిజమైన ఆత్మసంతృప్తి

**జవహర్ నగర్, ఆగస్టు 3 ,ప్రభాత వార్త:** గరీబోళ్లను ఆదుకుంటేనే నిజమైన ఆత్మసంతృప్తి లభిస్తుందని, మానవత్వానికి మించిన గొప్ప గుణం మరొకటి లేదని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, జవహర్ నగర్‌కు చెందిన నమ్మయ్య అనే దివ్యాంగుడు 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా దృష్టికి తీసుకెళ్గా, ఆయన వెంటనే స్పందించి నమ్మయ్య కుటుంబానికి అంత్య క్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, దివ్యాంగులు, పేదకుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, భవిష్యత్తులోనూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, గతంలో నమ్మయ్య గృహ నిర్మాణానికి కూడా శ్రీనివాస్ గుప్తా సహాయం చేశారని గుర్తు చేశారు. జవహర్ నగర్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిరంతరం తోడ్పాటునందిస్తున్న శ్రీనివాస్ గుప్తాకు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎద్దు శ్రీనివాసరెడ్డి, చెన్నాపురం రమేష్, నరసింహ, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మేన్

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**కొడంగల్,అగష్టు 3,ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.సోమవారం కొడంగల్ పట్టణ శావారులోని ఉడిమేశ్వరం గేట్ సమీపంలో గల ఎంజేపీ స్కూల్,కాలేజీలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌తో కలిసి వసతులు,ఆహారనాణ్యతను పరిశీలించారు.ఎంజేపీ స్కూల్,కాలేజీలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు,భోజన నాణ్యతను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్బంగా హాస్టల్‌లోని వంటశాల,భోజనశాల,విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత,పరిశుభ్రత,తాగునీటి సౌకర్యం, హాస్టల్ గదులు తదితర అంశాలను క్షుణ్ణంగా తనికీ చేశారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు,ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన,పోషకాహారం అందించడంతో పాటు హస్టల్ ప్రాంగణంలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని సంభందిత అధికారులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని,అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ తెలిపారు.

**మున్సిపల్ అభివృద్ధి పనులపై ప్రత్యేక పరిశీలన:**
మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు గాంధీనగర్,పాతకొడంగల్ తండాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు.4వ వార్డు గాంధీనగర్‌లో నిలిచిపోయిన పాఠశాల భవననిర్మాణం పనులు, పాత కొడంగల్ తండాలో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి సంభందించిన స్దలపరిశీలిన,అలాగే గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధిపనులను పరిశీలించారు.అనంతరం గుండ్లకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన పాఠశాల భవనం,సిసి రోడ్డు పనులను తనిఖీ చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంభందిత అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన విద్యా,మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

## గోదారంగనాయకస్వామి జాతరకు ఆహ్వానం



డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌కు ఆహ్వానం అందజేస్తున్న ధర్మకర్త పవనాచార్యులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి జాతరకు విచ్చేయాలని ఆలయ ధర్మకర్త టిపి.పవనాచార్యులు సోమవారం మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ శాసనభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డిలను ఆహ్వానించారు. వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డిల నివాసాలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లిన ధర్మకర్త పవనాచార్యులు వారిని శాలువాలతో సన్మానించి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈనెల 13 నుంచి 19 వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 16న గోదారంగనాయకస్వామి కళ్యాణం, 17న స్వామి విమాన రథోత్సవం నిర్వహిస్తారని హాజరు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులు-కీసరగుట్ట డైరక్టర్ సామల అమరేందర్, మాజీ ఎంపిటిసి కందుల కుమార్, సహకార సంఘం మాజీ డైరక్టర్లు జవాజీ సత్తయ్య ముదిరాజ్, గాయరు విశ్వనాధం, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మెట్టు నర్సింహ్మా, శ్రావణ్‌కుమార్, పి.రమేశ్, గిరిబాబు, శ్రీనివాస్, బస్వయ్య, లింగం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**మేడ్చల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** చెరువులో ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పెద్ద చెరువు మధ్యలో ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి వేలాడుతున్న ఉన్న విషయాన్ని సోమవారం మత్సకారులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కాగా మృతుడి వివరాలు తెలియరాలేదు. అతను ఆత్మహత్య చేసుకున్నాడా లేక హత్య గావించబడ్డాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కాశీ క్షేత్రంలో పట్నం రుక్కమ్మ గారి అస్తికల నిమజ్జనం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి

## కాశీ క్షేత్రంలో పట్నం రుక్కమ్మ అస్తికల నిమజ్జనం

**చేవెళ్ల, అగస్టు 3, ప్రభాతవార్త:** దివంగత శ్రీమతి పట్నం రుక్కమ్మ గారి అస్తికలను ఆమె కుమారులు, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి లతో కలిసి పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశీ (వారణాసి)లోని శ్రీ విశ్వనాథ స్వామి, అన్నపూర్ణేశ్వరి మాత సన్నిధి గంగా నదిలో వేద మంత్రోచ్చరణ సంప్రదాయబద్ధంగా సోమవారం నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులు ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమ్మగా, పెద్దమ్మ గా, నానమ్మ గా పట్నం రుక్కమ్మ చూపిన ప్రేమ, ఆప్యాయత, కుటుంబ విలువలు, సేవాభావం ఎల్లప్పుడూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని స్మరించుకున్నారు

## సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు వీల్‌చైర్లు పంపిణీ



విద్యార్థులకు చక్రాల కుర్చీలు పంపిణీ చేస్తున్న జీహెచ్ఎం శ్రీహరిరెడ్డి

**దౌల్తాబాద్,ఆగస్టు 3,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలకేంద్రంలోని జీపీఎస్ పాఠశాలలో ప్రత్యేక అవసరాల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థుల తల్లిదండ్రుల కొరకు అవగాహన సమావేశం నిర్వహించారు.కాంప్లెక్స్ ప్రధానోఫాధ్యాయులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.ఈ సంధర్బంగా జీహెచ్ఎం శ్రీహరిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు చక్రాల కుర్చీలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం శ్రీహరీ రెడ్డి,జీపీఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య,ఉపాధ్యాయులు సాయిలు,ప్రత్యేక ఉపాధ్యాయులు జి.ప్రభాకర్,చంద్రశేఖర్,ఐకేపీ సీసీ శాంత,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువుకు తొలి టీకా

**జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది: డాక్టర్ స్రవంతి**

**షాద్‌నగర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం ద్వారా తల్లిపాల ప్రాము ఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముురుపాలు తొలి టీకా వంటివని, అవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జననం తర్వాత మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహారం అవసరం లేదని సూచించారు.తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడంతో పాటు తల్లి ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు.ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వీటి ద్వారా తల్లి, గర్భంలోని శిశువుకు అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు.హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్ మాట్లాడుతూ పాప పుట్టిన వెంటనే మురుపాలు తప్పకుండా పట్టించాలని, అనంతరం పిల్లలకు అన్ని వ్యాధినిరోధక టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు.హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణులు సాధారణంగా తీసుకునే ఆహారం కంటే ఎక్కువసార్లు, కొద్దికొద్దిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్ప, ఏఎన్ఎంలు మధువాణి, లలిత, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**తలకొండపల్లి ఆగస్టు 3, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి కాసు సీతమ్మ ఆదివారం నాడు మృతి చెందారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నీ వారి ఇంటిలో మృతి చెందడంతో సోమవారం నాడు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై ఆమె దాన సంస్కారాలు పూర్తి చేశారు.

వృద్ధురాలైన సీతమ్మ మృతి చెందడం వారి కుటుంబానికి తీరనిలోటని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. అనంతరం ఆమె కుమారుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదగిరి నరసింహ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు కటికల శేఖర్ యాదవ్, రమేష్ యాదవ్, జ్యోతయ్య, శ్రీశైలం, బాల్ రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండాలి

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** భారతీయ కిసాన్ సంగ్ షాబాద్ శాఖ నెలవారి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై చర్చించడం కోసం ఆఫీస్‌కు వెళ్ళడం జరిగింది. గత నాలుగు నెలల నుండి విద్యుత్ అధికారులు భారతీయ కిసాన్ సంఘ రైతులకు అందుబాటులో ఉండటం లేదు సమస్యలు పరిష్కరించుకోవడం కష్టతరం అవుతుంది అలాగే రైతులకు ఎరువు బస్తాలు యాప్ ద్వారా బుక్ చేసుకున్నప్పటికిని 1350రూ బస్తాను 1800 రూపాయలకు బ్లాక్ రేట్లలో బహిరంగంగా అమ్ముతున్నారు. రైతుల వద్ద అక్రమంగా డబ్బులు తీసుకోవడం అనేది సరైనది కాదు కాబట్టి ప్రభుత్వం సరైన రేట్లలో రైతులకు ఎరువులు ఇవ్వాలని



సమావేశంలో పాల్గొన్న భారతీయ కిసాన్ సంగ్ నాయకులు

ప్రభుత్వం చర్య తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘం కోరుతుంది అంతేకాకుండా ఎరువు బస్తా అవసరమై డీలర్ వద్దకు వెళ్ళినప్పుడు అదనంగా వేరే సరుకు తీసుకుంటే ఇస్తామని చెప్పడం జరుగుతుంది .ఈ రకమైన విధానం రైతులకు ఇబ్బందికరంగా ఉంటుంది కాబట్టి తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నాం. ఈ సమావేశంలో భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి చంద్రయ్య, మల్లేష్ గోపాల్ రెడ్డి కుమారగూడెం ఎం శ్రీనివాసరెడ్డి ఎస్ లింగం ఇతర రైతులు పాల్గొన్నాం.

## బిజెవైఎం రాష్ట్ర నాయకులు వైభవ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**చేవెళ్ల, అగస్టు 3, ప్రభాతవార్త:** బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. మల్గారి వైభవ్ రెడ్డి, మండల నాయకులు అత్తెల్లి జగదీశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం చేవెళ్లలో బీజేపీ, బీజేవైఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు ప్రజాసేవలో అంకితభావంతో కొనసాగుతూ రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వైభవ్ రెడ్డి మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తానన్నారు .


## అర్హులైన దంపతులకు జిల్లా స్థాయి సర్టిఫికెట్లు జారీ

**..మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.ఆనంద్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3, ప్రభాతవార్త**
సరోగసీ విధానం కోసం ధరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన దంపతులకు సమావేశంలో జిల్లా స్థాయి సర్టిఫికెట్లు జారీ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా సరోగసి బోర్డు సమావేశం డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.ఆనంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సరోగసీ విధానం కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్దేశిత దంపతుల ధరఖాస్తులను సరోగసి (నియంత్రణ) చట్టం–2021, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగ పరిశీలించారు. అర్హతలు, అవసరమైన పత్రాలు, వైద్య ప్రమాణాలను క్షుణ్ణంగా సమీక్షించిన తరువాత అర్హులైన దంపతులకు జిల్లా స్థాయి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో సిఈఏ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గీత, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవిలత, శిశువైద్య నిపుణులు డాక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్యాలయంలో కానరాని అధికారులు

**కొడంగల్,అగష్టు 3,ప్రభాతవార్త:**



వ్యవసాయశాఖలో అధికారులు సమయ పాలన పాటించడం లేదు.సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయం పరిశీలించగా ఒక్క అధికారి కూడా కార్యాలయంలో లేకపోవడం వ్యవసాయశాఖ పనితీరుకు అద్దం పడుతోంది.వ్యవసాయ అధికారుల కోసం ప్రతిరోజు కార్యాలయంకు వస్తున్నా ఏ అధికారి ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.ప్రస్తుతం ఏ పంటలు సరిగ్గా లేవని కనీసం వ్యవసాయ అధికారులు ఏవైన సలహాలు ఇస్తారని వస్తున్నా ఏవరు ఉండడం లేదని అంటున్నారు.రైతు భీమా ధరఖాస్తు చేసేందుకు గత పది రోజులుగా కార్యాలయంకు వస్తున్నా అధికారులు లేక ప్రతిరోజు సాయంత్రం వరకు ఉండి వెళ్లిపోతున్నామని రైతు స్వప్న తెలిపారు.ఈ విషయంపై జిల్లా వ్యవసాయ అధికారి కవితతో ప్రస్తావించగా తాత్కాలిక ఉద్యోగులు విధుల నుంచి తొలగించడంతో కొంత ఇబ్బందిగా ఉందని అన్నారు.

## బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది

**డిఎంఎచ్‌ఒ సుధాకర్ లాల్**




**కుల్కచర్ల,అగష్టు 3,ప్రభాతవార్త:** ప్రతి తల్లి తన బిడ్డకు జన్మయిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది అని డిఎంఎచ్‌ఒ సుదాకర్ లాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమీక ఆరోగ్య కేంద్రంలోని మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ ముఖ్యఅథితులుగా పాల్గొన్ని మాట్లాడారు.తల్లి పాలు శిశవుకు సురక్షీతమైవి,స్వచ్ఛమైనవి,ఫోషక విలువలు కలిగినవని,శిశువు,ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని వివరించారు.బిడ్డల బంగారు భవిషత్తుకు కోసం తల్లి పాలు ఎంతో అవసరమని శిశువు పుట్టినప్పటి నుండి ఒక సంవత్సరం వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు.తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డలకు అందుతాయని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గర్భినిస్త్రిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య**

**షాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సంకేపల్లిగూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో గల నర్సరీ వద్ద ఇంటింటికి ఆరు మొక్కలను అందజేశారు. అదేవిధంగా ఓ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని తెలిపారు. చెట్ల సంఖ్య తగ్గడం, అడువుల శాతం తక్కువగా ఉండటం కూడా వర్షాల లేమికి కారణమని వివరించారు. వేసవి లో ఎండ తీవ్రతను తట్టుకోవాలంటే ఈ సీజన్ లో మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. ఎన్నినో పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. తద్వారా భూ గర్భ జలాలను కాపాడుకున్నవారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు సత్తయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి వాటిని సంరంక్షించాలి

**సర్పంచ్ చంద్రభూపాల్ రావు**

**కుల్కచర్ల,ఆగస్టు 3, ప్రభాతవార్త :** మొక్కలు విధిగా నాటి వాటిని రంక్షించాలని సర్పంచ్ చంద్రభూపాల్ రావు, ఎఎంసి చైర్మన్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతిలో స్థానిక నాచకులతో కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం గ్రామ ప్రజలకు మొక్కలు పంపిణి చేశారు.ఈ సందర్బంగా మాట్లాడుతూ..మొక్కలతో మనవ మనగడ సధ్యమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అరుణ భీమయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్క నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం

**మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు**

**మొయినాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ రాములు అన్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా సోమవారం మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లిగ్రామంలో సర్పంచ్ ఇంటింటికీ 6 మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ సంపూర్ణ రాములు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మరియు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షి ంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దివ్య,గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగ తనానికి వచ్చి నిద్రపోయాడు

**-నిందితుడిని పోలీసులకు అప్పగించిన ఇంటి యజమాని**

**వికారాబాద్,ప్రభాతవార్త :** విచిత్రమైన దొంగ తారసపడ్డాడు. దొంగ తనానికి వచ్చి ఇంట్లోని విలువైన సామాగ్రిని దోచుకుని, అక్కడే ఉన్న మంచం పై నిద్రపోయాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో నివాసం ఉంటున్నా నవీన్ కుమార్ అతని స్వ గ్రామమైన నవాబుపేట మండలం, చించల్ పేట గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వెళ్ళారు. సోమవారం ఉదయం తిరుగు ప్రయాణం అయ్యారు. వికారాబాద్ లోని ఇంటికి వచ్చి చూడగా, ఇంటికి వేసి ఉన్న తాళం పగలకొట్టి ఉండటంతో కాస్తా ఆందోళన చెందారు. ఇంటి లోపలికి వెళ్ళి చూడగా, ఇంటిలో భద్రపరిచిన రూ.20 వేలు నగదు, 2.8 తులాల బంగారు పుస్తెల దండా కనిపించలేదు. దీంతో ఇల్లు అంతా వెతకగా, అక్కడే బెడ్ రూమ్‌లో ఓ వ్యక్తి గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు. వెంటనే అప్రమత్తమైన నవీన్‌కుమార్ దయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా సదరు వ్యక్తి గాంధీ కాలనీకి చెందిన సెంట్రల్ మెథడిస్ట్ చర్చి యూత్ ప్రెసిడెంట్ ఎస్.వరుణ్ గా గుర్తించారు. నింధితుడిని పోలీసులకు అప్పగించారు. నింధితుడు వరుణ్ పై చర్యలు తీసుని, తమ ఇంటిలో దొంగిలించిన నగదు, ఆభరణాలు రికవరీ చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.




## ఇద్దరు రోగులకు సన్‌రైజ్ ట్రస్ట్ ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు ఘట్‌కేసర్ డివిజన్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆర్థికసాయం అందించింది. ఘట్‌కేసర్‌లో నివాసం ఉండే తాటిపర్తి మాలకొండయ్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఆయనకు 20 సంవత్సరాల కూతురు చిరంజీవి గంగోత్రి హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనేక ఆసుపత్రులు చుట్టూ తిరిగారు. చివరికి నిమ్స్‌లో చేర్పించగా బైపాస్ సర్జరీ చేయాలని దానికి దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుంది అని వైద్యులు చెప్పారు.

దీంతో తండ్రి సన్‌రైజ్ ట్రస్ట్ సభ్యులు టి.కృష్ణ ట్రస్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితురాలి వివరాలు పరిశీలించిన తరువాత సోమవారం ట్రస్టు తరఫున రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

వరంగల్ జిల్లాకు చెందిన వడ్లురు భారత్ అనే ఒక చిరుద్యోగికి మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల, మెదడుకు సర్జరీ జరిగిందని, దాని వల్ల గుండె కూడా బలహీనపడిందని వైధ్యులు తెలిపారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈవిషయాన్ని ఆల్వా వీరారెడ్డి ట్రస్ట్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మెడికల్ రిపోర్టులు పరిశీలనానంతరం రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో వై.సుందర రావు, సోమయ్య, వీరారెడ్డి, కృష్ణ, ఐలయ్య, బంగారు బాబు, అజయ్ కుమార్, సదానందం, సత్యం, పల్లవిరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.